# జిడ్డుగాడు!

మా వాడు మహాజిడ్డు! వాడి ఇంటిపేరు కూడా 'జిడ్డు' కావటంతో శ్రీకాంత్ పరమజిడ్డుగా తయారైనాడు.

వీడి బాధ భరించలేక ఫ్రెండ్సంతా కలిసి 'జిడ్డుశ్రీ' అనే బిరుదు ప్రసాదించి పిలవనారంభించారు.

బిరుదు ప్రదానానంతరం నూనె జిడ్డులాంటి వాడల్లా ఆముదం జిడ్డులా తయారయ్యాడు.

మనిషి ఎర్రగ బుర్రగ నాజూగ్గా... కర్లీ హెయిర్... అందమైన మీసకట్టు... కోటేరులాంటి ముక్కు... కాళ్ళజర్రి వంటి కనుబొమలు... లేలేత పెదాలు... వాడిని చూడగానే సినిమా హీరో అంటే నమ్మేస్తారు. అంతటి హేండ్సమ్ ఫెలో మా శ్రీకాంత్.

పావలాపెట్టి బఠాణీలు కొనుక్కోడు. హోటల్లో చచ్చిగీపెట్టినా పది రూపాయలు పెట్టి కాఫీ తాగడు. ముఖానికి పౌడర్ అద్దుకోడు... ఎండాకాలంలోనైనా డియోడరెంట్ స్ప్రే వాడడు. ఇంట్లో చద్ది అన్నం తినొస్తే మళ్ళీ ఇంటికెళ్ళేకే ఏదైనా తిండి!

ఆఫీసులో వున్న పాతికమంది పూర్ ఫెలోస్‌లో శ్రీకాంత్ వక్కడే అందగాడు. వీడంటే లేడీ స్టాఫ్ పడిచస్తారు.

వాడిని గిల్లాలని చూస్తారు. గిచ్చాలని అనుకుంటారు. మనవాడు ఏమాత్రం కొరుకుడు పడడు.

కొరకరాని కొయ్య శ్రీకాంత్!

అయినా సరే... శ్రీకాంత్ లక్కీఫెలో! వాడి డాడీ ఐ.టి.ఓ కావటాన... ఇంట్లో ఏమూల చూసినా నోట్ల కట్టలు... డబ్బు సంచీల గుట్టలు!... సిరులు మూలిగే ఇంట... శ్రీకాంత్ సిరులు పండే పంట! అంటే ఒక్కడే కొడుకు!... వంశోద్ధారకుడు.

శ్రీకాంత్ నెలజీతం సుమారు డెబ్భైవేలు! వాడికో కారు. వాడికారులో వాడి సరసన బైఠాయిద్దామని ఎందరో ఆడకొలీగ్స్ ట్రైచేసి ఫెయిలైనారు.

ఆఫీసులో అనుక్షణం శ్రీకాంత్‌చుట్టూ తేనెటీగల్లా తిరుగుతూ అతగాడిపై వాలిపోదామని ఎందరో అమ్మాళ్ళు ప్రయత్నించి ఫెయిలైనారు.

వారిలో శ్రీకాంత్‌కి ఏ ఒక్క చక్కని చుక్కా నచ్చలేదు.

లేడీస్ ఓరగా చూచినా... అరనవ్వే నవ్వినా కన్నుగీటినా... కింద పెదవిని పై పంటితో కసిగా నొక్కినా మా జిడ్డుగాడిలో ఏవిధమైన చలనమూ వుండదు. అదేం ఖర్మో?-

వాడికున్న బ్యూటిఫుల్ నేమ్‌తో వాడిని ఎవరం పిలవరు. అంతా జిడ్డుగాడనే సంబోధిస్తారు. అట్లా పిలిస్తేనే వాడు తెగ సంబరపడిపోయి రెస్పాన్స్ ఇస్తాడు.

వాడొట్టి చలనంలేని రాతి మనిషి!

అదే వేరెవరైనా అయితే వెంటబడే ఆడాళ్లను ఝూమ్... ఝూమ్మంటూ కార్లో సిటీ అంతా తిప్పేసి చీకటిపడే వేళకి... పిక్చర్‌కో... పబ్బుకో లాక్కెళ్ళి ఎంచక్కా లైఫ్ ఎంజాయ్ చేస్తాడు.

వీడు పరమ పీనాసి కాబట్టి ఏ ఆడపిల్ల వంక చూడడు. ఆడవాసనకు ఆమడదూరంలో వుంటాడు. ఎక్కడ వాళ్ళకోసం డబ్బు అనవసరంగ ఖర్చు పెట్టాల్సివస్తుందోనే భయం!

లవ్ పట్ల శ్రీకాంత్‌కి బోలెడంత ఏవగింపు! ప్రేమ వాసనే పడదు. వాడి దృష్టిలో 'లవ్వ'నేది ఓ జడ పదార్థం!

అదేమంటే ఈ తరం అమ్మాయిలను నమ్మకూడదంటాడు. అనవసరంగ వెంట తిరుగుతూ వెకిలి వేషాలేస్తూ డబ్బు ఇష్టమొచ్చినట్టు ఖర్చు పెట్టిస్తారంటాడు. వారి సరదాలు తీరేక మనసిచ్చిన మగాడిని పక్కకు నెట్టేసి వాడినో బికారిని చేసి మళ్ళీ వాడి ముఖం కూడా చూడరంటాడు. పెళ్ళి విషయం ప్రస్తావనకొస్తే దూరంగ పారిపోతారనేది వాడి అభిప్రాయం! మార్కెట్లో లవ్ బిజినెస్‌కు మాంచి డిమాండ్ వుందిట! అందుకే వాళ్ళకి దూరంగా వుంటాడట!

ఈ తరం కుర్రకారులో వుండే లక్షణం ఏ వక్కటీ శ్రీకాంత్‌లో లేదు.

లేడీస్టాఫ్ ఎవరైనా బర్త్‌డే పార్టీకి ఆహ్వానిస్తే... వట్టి చేతుల్తో వెడతాడు. కనీసం బొకే అయినా కొనివ్వడు. పోనీ ఫంక్షన్‌కి వెళ్ళినవాడు ఓ.సీ.గ వచ్చింది కదాని పీకలదాకా మెక్కుతాడా అంటే అదీలేదు. జస్ట్ విష్‌చేసి తిరిగి వెంటనే వెళ్ళిపోతాడు.

తన ఆఫీసు పదవ అంతస్తులో వుండటాన తప్పనిసరిగ లిఫ్ట్‌లో వెళ్ళాల్సిందే! మానవ మాత్రుడెవ్వడు నడిచి వెళ్ళలేడు. మోకాళ్ళ పర్వతమైనా అవలీలగ ఎక్కొచ్చేమోగాని...

పది అంతస్థులు ఎక్కి వెళ్ళాలంటే చావుకొస్తుంది. పదిసార్లు ఎక్కితే మంచాన పడాల్సిందే!

ఆ రోజెందుకో శ్రీకాంత్ అనబడే జిడ్డుగాడు లేటుగ ఆఫీసు చేరుకుని లిఫ్టులోకి జొరబడ్డాడు. అప్పటికే అక్కడ కోమలి వుండటంచూచి బెదిరిపోయి లిఫ్టులోనుంచి బైటికొచ్చేద్దామనుకుంటుండగా... కోమలి అతగాడి చెయ్యి పుచ్చుకుని ఆపి బటన్ నొక్కటంతో లిఫ్ట్ నవవధువులా మెల్లగా పయనించనారంభించింది.

కోమలి తన చేయి పట్టుకున్న క్షణాన తన శరీరంలో కరంట్ పాసైనట్టు... వింత విచిత్రమైన అనుభూతి కలిగింది. ఆ అనుభూతిలో థ్రిల్ ఫీలైనాడు.

'లిఫ్టు'లో కోమలి తనూ ఇద్దరే!

కోమలి అందగత్తె అన్పించింది. ఆమెకేసి నిశితంగ తానెప్పుడు చూచి శల్యపరీక్ష చేసిన పాపాన పోలేదు. ఆమె సుందర వదనారవిందాన్ని వీక్షించటం ఇదే తొలిసారి.

తనకోసం సీరియస్‌గ ట్రై చేస్తోందని... తనను లవ్ చేస్తోందని కొలీగ్స్ చెప్పగా విన్నాడంతే!

తాను కోమలి మత్తులో ఎప్పటికైనా పడకపోతానాని నిరీక్షిస్తుందేమో... ఈరోజు సమయం సందర్భం చూచి చెయ్యి పట్టుకుంది. తాను వంటరిగ చిక్కటంతో మహదానందపడుతున్నట్టు కోమలి ముఖకవళికల ద్వారా గ్రహించగలిగేడు.

లిఫ్ట్ సాగుతూనేవుంది. చెరొకవైపు ఒకరినొకరు ఆపోజిట్ డైరెక్షన్‌లో వున్నారు. మాటల్లేవు. చూపులే చోటు చేసుకున్నయ్.

తనకేమో జంకుగా వుంది! వున్నట్టుండి కోమలి తనవైపుకొచ్చి పడబోయినట్టు నటిస్తూ జిడ్డుగాడిని గాఠిగ కౌగలించుకుంది.

సడన్‌గ లిఫ్ట్ ఆగింది! ఇద్దరిలోనూ కంగారు కట్టలు తెంచుకుంది.

పాడు కరంట్ ఇప్పుడే పోవాలా? గొణుక్కున్నాడు.

మరో అర్ధగంటవరకు పవర్ రాకుండా వుంటే బావుండని కోమలి మనసులో కోటిదేవుళ్ళకు మొక్కింది.

అమ్మో! భయంగా వుంది... అంటూ గాఢంగ శ్రీకాంత్‌ని చుట్టేసుకుంది. కోమలి చర్యను కాదన్లేకపోతున్నాడు. ఏదో హాయి... తన్మయత్వం తనను ఎక్కడికో లాక్కెడుతోంది.

అంతలోనే ఇద్దరిలోనూ భయం... ఆందోళన... మనసులో ఏదో కలవరపాటు...

తాను పొరపాటు చేస్తున్నవాడిలా 'ఫీ'లై గింజుకుని కోమలి బిగి కౌగిలిలోంచి పెకిలించుకుని దూరంగ జరిగేడు.

ఎంత తప్పు జరిగింది! తనెందుకు ఈ క్షణంలో ఐస్‌ముక్కలా కరిగిపోయినట్టు?-

ఇంతలో పవర్ రానే వచ్చింది. లిఫ్ట్ పైకి మందగమనంతో సాగుతోంది.

ఏమీ తెలియని వారిలా ఒకరినొకరు దోషుల్లా చూసుకుంటున్నారు.

పదవ అంతస్తు చేరిన లిఫ్ట్ ఆగింది. డోర్ ఓపెనైంది. ముద్దాయిల్లా ఇద్దరూ బైటికొచ్చి చెరొకవైపూ నడిచారు ఆఫీసులోకి.

ఈ విషయం ఎట్లా బైటికి పొక్కిందో ఏమో... ఆఫీసంతా పాకింది. గుసగుసలు మొదలైనయ్.

తానెవరికీ లిఫ్ట్‌లో జరిగిన విషయం చెప్పలేదు. అంటే... కోమలి ప్రచారం చేసి వుండాలి! తోటివారితో గొప్పగ చెప్పుకుని వుంటుంది. లేకపోతే... ఎగ్జామ్ క్వశ్చన్ పేపర్ లీకైనట్టు... ఆఫీసులో అందరికీ విషయం ఎలా తెలిసింది.

'ఓహో!... అదా సంగతి అర్ధగంటసేపు ప్రేమికులిద్దరూ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారన్నమాట! అర్ధగంట సేపు అంటే... ఎన్నిసార్లు అయినా ముద్దులు పెట్టుకుని వుండచ్చు... గాలి దూరే సందులేకుండా బిగి కౌగిట్లో నలిగిపోయి... వుండచ్చు... ఇంకా చాలా చాలా జరిగి వుండటానికి బోలెడంత స్కోప్ వుంది...' విషయం తెల్సుకోగానే కోమలి చుట్టూ చేరిన ఆడ కొలీగ్స్ ఆటపట్టించారు.

'నోనో! అదేంలేదు. జిడ్డుగాడొట్టి బెదురుగొడ్డు! కనీసం దగ్గరక్కూడా రాలేదు. పైగా ఒకటే వుక్కపోత! ఊపిరాడక విలవిల్లాడిపోతే మీరేంటీ ముద్దులు ములక్కాయలు అంటూ...' బుంగమూతి పెట్టింది కోమలి.

ఆ రోజంతా ఆడంగులు ఆఫీసులో పనే చెయ్యలేదు. ముచ్చట్లాడుకోవటానికే టైమ్ సరిపోలేదు.

జిడ్డుగాడు సిగ్గుతో బిక్కచచ్చిపోయాడు.

'మొత్తానికి లవ్‌గేమ్‌లో పడ్డావ్ కుడితిలో పడ్డ ఎలుకలాగా! ఇంకేం... త్వరలో గ్రంథసాంగుడవవుతావ్... ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మా అందరినీ ఫైవ్‌స్టార్

హోటల్‌కి తీసుకెళ్ళి మందు పార్టీ ఇవ్వాల్సిందే...' కొలీగ్స్ మంకుపట్టు పట్టారు.

'అసలేం జరగలేదురా బాబూ అంటే నమ్మరేం?- ఇవన్నీ మీ ఊహాగానాలు. మీడియా సృష్టి...' బొంకి లెంపలేసుకుని మందుపార్టీ ప్రతిపాదన విరమించేలా చేశాడు.

'మేమేం చెవుల్లో క్యాబేజీ పూలు పెట్టుకోలేదు నీ మాటలు నమ్మటానికి...' అని ఒకరంటే...

'ఇంతకూ ఎడ్వాన్సయింది ఎవరు? నువ్వా కోమలా?...' మరో కొలీగ్ కామెంట్.

'వీడి ముఖం వీడికి అంత ధైర్యం కూడానా? ఆ అమ్మాయి... అదే కోమలి ఫాదరు సిటీలో పోలీస్ కమీషనర్! వీడు తిక్కవేషాలు వేశాడని ఆ పిల్ల వాళ్ళ డాడీతో చెప్పిందో... వీడి మక్కెలిరగ్గొట్టి బొక్కలో తోస్తాడు...' మూడో ఫ్రెండ్ బెదరగొట్టాడు.

ఈ విధంగ ఎవరికి తోచినట్టు వారు వూహించుకుంటూ జిడ్డుగాడిని ఆటపట్టిస్తూ రోజంతా ఏడిపించారు.

★ ★ ★ ★ ★

లిఫ్ట్‌లో జరిగిన ఇన్సిడెంట్‌ని ఆధారంగ చేసుకుని కోమలి మరో 'స్టెప్' ఎడ్వాన్సైంది. జిడ్డుని మరింత ఏడిపించటానికి నడుము బిగించింది. ఆవిధంగ బెదరకొడితేనైనా దారికొచ్చి తనను లవ్ చేస్తాడేమోనే ఆశ చావక!

తనకు అన్యాయం జరిగిపోయిందంటూ ఏడుపుముఖం పెట్టిన కోమలి... లొంగకపోతే... మీడియాకి కూడా అసలు సంగతి చెప్తానంటూ మరోవైపు బెదిరించసాగింది.

ఏం చేయటానికీ తోచని జిడ్డుగాడు కుయ్యో మొర్రో అంటున్నాడు. ప్రతిదానికీ 'మీడియా' అంటుందేమిటీ? బెదిరింపా? అని పిలిచింది.

చివరికి తన పరువు వీధిన పడేట్టుందని బెదిరిపోసాగాడు.

'ఒరేయ్ జిడ్డూ!- ఏమీ జరగలేదని నువ్వు బుకాయించి లాభంలేదు. ఆడపిల్ల... అందులోనూ పెళ్ళి కాని అందమైన ఆడపిల్ల... అదీకాక పోలీసు కమీషనర్ ఏకైక పుత్రిక చచ్చినా అబద్ధం చెప్పదు...' పక్క ఛైర్లో వున్న కొలీగ్ హెచ్చరించాడు.

'అదట్లా వుంచు! పైగా కోమలి నెలతప్పిందట... అందుక్కారణం నువ్వేనంటూ అందరితో చెప్పి భోరుమందిట- ఇక నువ్ తప్పించుకోలేవురోరేయ్!

'అయితే మనవాడికి లాఠీదెబ్బలు... శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదా?...' ఎదురుగా వున్న ఇంకో కొలీగ్ బెదరగొట్టేడు.

'నామాట విను!... జరిగిందేమిటో బాహాటంగ వప్పేసుకో! కోమలి మెడలో తాళికట్టు! లేకపోతే నీ ఆటకట్టే!... కాబట్టి...'

'కాబట్టి లేదు బంకమట్టిలేదు... నోళ్ళు ముయ్యండిరా!...' ఉక్రోషంతో వూగిపోయాడు జిడ్డు.

'మానోళ్ళు మూయిస్తావ్ సరే! మరి ఆ అమ్మాయేమో మిరపకాయ తిన్న కాకిలా కావ్... కావ్ మంటూ అనన్య ప్రచారం సాగిస్తోంది. ఏదోటి తేల్చుకో. నువ్ సైలెంట్‌గ వుంటే మటాషే... గోవిందా గోవింద'

'అంతేనంటారా?-' వెర్రిముఖం వేశాడు.

'పోలీసులు... కటకటాలు... కోర్టుకేసు ఇవన్నీ నిన్ను మింగేసేలోపే నువ్వు ప్రొసీడైపో... అప్పుడే ప్రాబ్లమూ వుండదు. అంతా హేపీ సే! తర్వాత మీ పెళ్ళి... ఆ తర్వాత హనీమూన్! అన్నీ వెంట వెంటనే జరిగిపోతయ్ జిడ్డూ!-'

'ఒరేయ్! విషయాన్ని అనవసరంగ నాన్చకు! చావో... రేవో తేల్చుకో...!'

అవును! తనది రెస్పక్టబుల్ ఫ్యామిలీ! సొసైటీలో తనకంటూ ఓ స్టేటసు... లెవలూ వున్నయ్!

పోయిపోయి పోలీసోడి చేత లాఠీదెబ్బలు తినేకంటే... కష్టమో నిష్ఠూరమో... కోమలి మెడలో తాళికట్టేస్తే... ప్రాబ్లమ్ సాల్వ్ అవుతుంది. మనశ్శాంతి... పరువు దక్కుతుంది... అనుకున్న జిడ్డుగాడనబడే శ్రీకాంత్ తన అభిప్రాయాన్ని డాడీ మమ్మీలతో చెప్పేశాడు.

ఇప్పటికైనా ధైర్యంచేసి శ్రీకాంత్ తీసుకున్న నిర్ణయానికి మురిసిపోయింది కోమలి!

జైలుకంటే పెళ్ళేనయమనిపించటంతో జిడ్డుగాడి వివాహం కోమలితో అత్యంత వైభవోపేతంగ జరిగింది!

అక్కడితో శుభంకార్డ్ పడటమే కాకుండా... 'జిడ్డుగాడు' అంటూ శ్రీకాంత్‌ని పిలిచే పద్ధతికి ఆఫీసులో వారంతా ఫుల్‌స్టాప్ పెట్టారు.

- సమాప్తం -